క్లుప్తంగా

పేద కుటుంబానికి ప్రతినెల రూ.2 వేల సాయం



ఆర్థికసాయం అందజేస్తున్న మహేష్‌రెడ్డి

నడిగూడెం : మండలంలోని కరివిరాల గ్రామంలో నిరుపేద షేక్.రంజాన్‌బీ కుటుంబానికి గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త గార్లపాటి మహేష్‌రెడ్డి గత కొన్ని నెలలుగా ప్రతి నెల రెండు వేల ఆర్థికసాయం అందజేస్తూ చేయూనందిస్తున్నారు. ఆమె భర్త సిద్దయ్యకు కళ్లు సరిగా కనిపించకపోవడంతో ఇటీవల సొంత ఖర్చులతో శస్త్ర చికిత్స చేయించారు. శుక్రవారం ఈనెల రెండు వేల ఆర్థికసాయాన్ని వారికి అందజేసి మాట్లాడారు. ఇప్పటివరకు రూ.72 వేలు ఇచ్చినట్లు తెలిపారు. పేద కుటుంబానికి అండగా నిలుస్తున్న మహేష్‌రెడ్డిని గ్రామ పెద్దలు ఈ సందర్భంగా అభినంది ంచారు. కార్యక్రమంలో కేశగాని భద్రయ్య, మారుతి గోపి, సంతోష్, ఉపేందర్, శశిధర్‌రెడ్డి, రహీం సాహెబ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు నవోదయ ప్రవేశ పరీక్ష

కోదాడ : నవోదయ విద్యాలయాల్లో 9, 11 తరగతుల్లో మిగిలి ఉన్న సీట్ల భర్తీకి శనివారం కోదాడలో ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు కోదాడ మండల విద్యాధికారి సలీం షరీఫ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని బాలుర పాఠశాల సెంటర్‌లో 240 మంది, బాలికల పాఠశాలలో 240 మంది, సీసీరెడ్డి పాఠశాలలో 274 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ పరీక్ష ఉంటుందని, నిమిషం ఆలస్యమైనా అనుమతి ఉండదని విద్యార్థులు 10 గంటల వరకు పరీక్ష కేంద్రం వద్దకు చేరుకోవాలని సూచించారు.

ప్రతిభను వెలికితీసేందుకు టాలెంట్ టెస్టులు దోహదం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

కోదాడ : విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికి టాలెంట్ టెస్టులు దోహదపడతాయని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మేకల శ్రీనివాసరావు అన్నారు. గత నెలలో ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు నిర్వహించిన టాలెంట్ టెస్ట్ విజేతలకు శనివారం కోదాడలోని రేస్ కళాశాలలో బహుమతులు అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో రేస్ కళాశాల చైర్మన్ బాణాల వసంత, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ సంఘాల నాయకులు చేపూరి కొండలు, తమ్మన బోయిన నరేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నేరేడుచర్ల : దిర్శించర్ల 33/11కేవీ సబ్ స్టేషన్ పరిధిలోని 11కేవీ లైన్‌కు అనుసంధానంగా ఉన్న నేరేడుచర్ల టౌన్–2 ఫీడర్ పరిధిలోని రామాపురం రోడ్డులో నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్నందున శనివారం ఉదయం 10గంటల నుంచి 2గంటల వరకు రాంపురం రోడ్డులో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు నేరేడుచర్ల మండల విద్యుత్ ఇన్‌చార్జ్ ఏఈ పందిరి శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా మండలంలోని 33/11కేవీ తెలగ రామయ్యగూడెం సబ్ స్టేషన్‌లో నిర్వహణ పనులు, 33 కేవీ తెలగరామయ్యగూడెం ఫీడర్‌లో మరమ్మతులు చేపడుతున్నందున తెలగరామయ్యగూడెం సబ్ స్టేషన్ పరిధిలోని అన్ని 11కేవీ ఫీడర్లకు శనివారం ఉదయం 10గంటల నుంచి 3గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘించొద్దు



మాట్లాడుతున్న ఎస్ఐ రాంబాబు గౌడ్

చిలుకూరు : ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్నందున నిబంధనలు పాటిస్తూ కనకదుర్గమ్మ జాతరను జరుపుకోవాలని ఎస్ఐ సురభి రాంబాబుగౌడ్ సూచించారు. చిలుకూరు మండలంలోని జెర్రిపోతులగూడెం గ్రామంలో ఈనెల 13, 14, 15 తేదీల్లో నిర్వహించే కనకదుర్గమ్మ జాతర సందర్భంగా శుక్రవారం నిర్వహించిన అఖిల పక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతరలో డీజేలు, డ్యాన్స్ ప్రోగ్రామ్‌లు పెట్టొద్దని, రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు ఏర్పాటు చేయవద్దన్నారు. బేతవోలులో జరిగే జాతరలో కూడా ఇవే నిబంధనలు పాటించాలన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

పంట నమోదు తప్పనిసరి

నేరేడుచర్ల : ప్రస్తుత యాసంగి సీజన్‌లో ఎంటీయూ– 1010 వరి సాగు చేసిన రైతులు వ్యవసాయ విస్తరణాధికారికి తప్పనిసరిగా తెలియజేసి పంట నమోదు చేయించాలని మండల వ్యవసాయ అధికారిని జి.నిర్మల శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. పంట నమోదు చేయించకపోతే ధాన్యం కొనుగోళ్లు వీలు కాదని ఆమె తెలిపారు.

డేంజర్ మలుపులు

చిలుకూరు : మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రోడ్ల మూలమలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. మలుపుల వద్ద కంపచెట్లు రోడ్లను కమ్మేయడంతో ఎదురెదురుగా వచ్చే వాహనాలు కనపడక ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రధానంగా చిలుకూరు నుంచి దూదియాతండా వెళ్లే రోడ్డు, దూదియాతండా నుంచి జానకీనగర్ వెళ్లే రోడ్డులో, సీతారాంపురం నుంచి నారాయణపురం వరకు, చిలుకూరులోని ఆంజనేయస్వామి ఆలయం నుంచి రామాపురం వరకు, చిలుకూరు చెరువు వద్ద నుంచి ఆర్లెగూడెం వెళ్లే దారిలో మూల మలుపులు కంపచెట్లతో ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ మలుపుల వద్ద రెండు నెలల వ్యవధిలో పదికి పైగా ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు ఇరు పక్కల కంపచెట్లను తొలగించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



చిలుకూరు నుంచి దూదియాతండా మార్గంలో మూలమలుపులో రోడ్డును కమ్మేసిన కంపచెట్లు



చిలుకూరు - ఆర్లెగూడెం రోడ్డులో ఇలా..



దూదియాతండా- జానకీనగర్ రోడ్డులో మూలమలుపు

రమాబాయి అంబేడ్కర్‌కు ఘన నివాళి

నేరేడుచర్ల : పట్టణంలోని ప్రధాన కూడలిలో రమాబాయి అంబేడ్కర్ జయంతిని శుక్రవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు యడవల్లి చంద్రయ్య, అరుణ్, పున్నయ్య, రామకృష్ణ, మాతంగి రామయ్య, మనోజ్, రవి, మాతంగి విజయ్, మధు, జాను, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



రమాబాయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

వర్గీకరణ బిల్లు ఆమోదాన్ని స్వాగతిస్తున్నాం

కోదాడరూరల్ : ఎస్సీ వర్గీకరణ బిల్లును చట్ట సభల్లో అమోదించడాన్ని స్వాగతిస్తున్నామని టీఎమ్మార్పీఎస్ దక్షిణ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు చింత బాబుమాదిగ అన్నారు. శుక్రవారం పట్టణంలో నిర్వహించిన సంఘం ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సుప్రీం కోర్టు తీర్పు మేరకు మాదిగల చిరకాల కోరిక అయిన ఎస్సీ వర్గీకరణను రాష్ట్రంలో అమలు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రివర్గ ఉప సంఘాల చైర్మన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వైస్ చైర్మన్ దామోదర రాజనర్సింహతో పాటు ఉద్యమ నాయకులు మంద కృష్ణ మాదిగకు కృతజ్ఞతలు తెలిపారు. అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిన పంబాల, మన్నే కులాలను కేటగిరి ఏ నుంచి తొలగించి సీలో చేర్చాలని బలహీనులుగా వెనుకబడి ఉన్న బుడగ జంగాలు, డెక్కలి కులాలను ఏ కేటగిరిలోకి తేవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు బాణాల అబ్రహం, కందుకూరి నాగేశ్వరరావు, బొల్లెపోగు స్వామి, నారకట్ల ప్రసాద్, కాశయ్య, బాబురావు, శ్రీను, చిన్ని, చంటి ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చింతా బాబు

కార్యకర్తలకు అండగా ఉంటాం

కోదాడరూరల్ : బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. మండలంలోని తొగర్రాయిలో వెన్నెముక సర్జరీ చేయించుకొని విశ్రాంతి తీసుకుంటున్న బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు అమరబోయిన శ్రీనివాస్‌యాదవ్‌ను శుక్రవారం ఆయన పరామర్శించి మాట్లాడారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ చింత కవితారాధారెడ్డి, నాయకులు దొంగల లక్ష్మీనారాయణ, ముత్తవరపు రమేష్, పొట్టా కిరణ్, శెట్టి సురేష్, ఉద్దండు, ఇమ్రాన్‌ఖాన్, ఉపేందర్, కిరణ్‌చౌదరి ఉన్నారు.

వైభవంగా విజయగణపతి ఆలయ వార్షికోత్సవం



అన్నదానం చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కోదాడరూరల్ : కోదాడ పట్టణంలోని విజయగణపతి దేవాలయ 20వ వార్షికోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి పంచామృతాభిషేకం జరిపి తీరొక్క పూలతో అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై పూజలు చేశారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి కృష్ణయ్య, చలపాటి శివ, ఓరుగంటి బ్రహ్మం, చలపాటి రామారావు, వంగవీటి లక్ష్మణ్‌రావు, గోపారపు ఉపేందర్, మేకల నరేష్ తదితరులు ఉన్నారు.

ఘనంగా తిరుపతమ్మ, గోపయ్య కల్యాణ మహోత్సవం



స్వామివార్లను ఊరేగిస్తున్న భక్తులు

నడిగూడెం : మండల కేంద్రం సమీపంలో గల తిరుపతమ్మ ఆలయంలో శుక్రవారం శ్రీలక్ష్మీతిరుపతమ్మ, గోపయ్య కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో అర్చకులు, భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నడిగూడెంలో దేవతామూర్తులను ఊరేగించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

గరిడేపల్లి : అర్హులైన రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తుందని సీపీఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం గరిడేపల్లి మండలంలోని కాల్వపల్లి గ్రామంలో నిర్వహించిన సీపీఐ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో రుణమాఫీ కాక లక్షల మంది రైతులు బ్యాంకులు, వ్యవసాయ శాఖ కార్యాలయాల చుట్టూ చెప్పులు అరిగేలా తిరుగుతున్నారని, అయినా రాష్ట్ర ప్రభుత్వం రైతులను పట్టించుకోకపోడం విచారకమన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం రైతులందరికీ రుణ మాఫీ చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో చెవ్వా వెంకన్న, సరోజనమ్మ, సైదులు, మెండె లింగరాజు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పూల రవీందర్‌కు ఓటు వేసి గెలిపించాలి

- ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పర్వతరెడ్డి

గరిడేపల్లి : వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎస్టీయూ అభ్యర్థి పూల రవీందర్‌కు ఓటు వేసి గెలిపించాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎం. పర్వతరెడ్డి కోరారు. శుక్రవారం గరిడేపల్లి మండలంలోని పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులను ఆయన ప్రత్యేకంగా కలిసి మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి, ప్రభుత్వ విద్యారంగంలో మౌలిక సదుపాయాల కల్పనకు చట్టసభల్లో బలమైన గొంతుకను వినిపించేందుకు పూల రవీందర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఓరుగంటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ శిరీష

హుజూర్‌నగర్ : బాలికలు పౌష్టికాహారం తీసుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని ప్రముఖ గైనకాలజీ డాక్టర్ గంపల శిరీష అన్నారు. శుక్రవారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో కౌమారదశ బాలికలకు ఆరోగ్యంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. బాలికలు ఫాస్ట్ ఫుడ్‌కు దూరంగా ఉండాలన్నారు. సమతుల ఆహారం తీసుకోవాలని చెప్పారు. యుక్త వయస్సులో ఎదుర్కొనే అనారోగ్య సమస్యల పట్ల అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం జయప్రద, ఉపాధ్యాయులు శైలజ, ఆర్ విజయ, షబానా, మాధవి, కరుణ, అపర్ణ జీవన, రామనరసమ్మ, కమలమ్మ, విజయలక్ష్మి, జానీ బేగం, వనజ, పీడీ జనార్దన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోదాడలో రెచ్చిపోతున్న దొంగలు

- వారంరోజుల వ్యవధిలో ఐదు ఇళ్లలో చోరీ

కోదాడ రూరల్ : కోదాడ పట్టణంలో దొంగలు వరుస చోరీలకు పాల్పడుతూ రెచ్చిపోతున్నారు. వారం రోజుల వ్యవధిలో ఐదు ఇళ్లల్లో దొంగతనం చేశారు. శుక్రవారం మధ్యాహ్నం సమయంలో పట్టణ పరిధిలోని బాలాజీనగర్‌లో తాళం వేసి ఉన్న గజ్జర్లపుడి శ్రీనివాసరావు ఇంట్లోకి చొరబడి ఆరు తులాల బంగారం, రూ.50 వేల నగదును అపహరించుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. అదేవిధంగా నయానగర్‌లోని 14వ వార్డులో తాళం వేసి ఉన్న రెండు ఇళ్లల్లో కూడా చోరీకి పాల్పడ్డారు.

మల్సూర్ మృతి బాధాకరం



మల్సూర్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

మోతె : ప్రైవేటు కళాశాల లెక్చరర్ గురిజాల మల్సూర్ (40) అకాల మరణం బాధాకరమని కాంగ్రెస్, ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. శుక్రవారం మోతె మండల కేంద్రంలో మల్సూర్ మృతదేహానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మల్సూర్ కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. నివాళులర్పించిన వారిలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కీసర సంతోష్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ పుల్లారావు, ఎమ్మార్పీఎస్ నాయకులు, కళాకారులు, స్నేహితులు ఉన్నారు.

వేడుకలకు ఆలయాలు ముస్తాబు

- మునగాలలోని హనుమాన్ ఆలయంలో రేపటి నుంచి వార్షికోత్సవాలు

మునగాల : మండల కేంద్రంలోని శ్రీరామలింగేశ్వర హనుమాన్ ఆలయ 65వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు సర్వం సిద్ధం చేశారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. ఆలయాన్ని రంగులు, విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. శనివారం గ్రామంలోని పురవీధుల్లో స్వామివారి శోభాయాత్ర నిర్వహించనున్నారు. ఆదివారం ఉదయం నగర సంకీర్తనతో వేడుకలు ప్రారంభమవుతాయని ఆలయ కమిటీ అధ్యక్షుడు తూముల వీరస్వామి తెలిపారు. అనంతరం హనుమాన్ పతాకావిష్కరణ, అఖండ దీపారాధన ఉంటుందన్నారు. ఆదివారం నుంచి మూడు రోజుల (72గంటల) పాటు నిరంతర హరేరామనామ సంకీర్తన నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతియేటా మాఘమాసంలో గ్రామానికి చెందిన హనుమాన్ భక్తబృందం, శివ భక్తసమాజం ఆధ్వర్యంలో 72 గంటల పాటు నిరంతర హరేరామనామ సంకీర్తన నిర్వహించడం గత ఆరు దశాబ్దాలుగా ఆనవాయితీగా కొనసాగుతుందని తెలిపారు. 10న ఆంధ్రప్రదేశ్‌లోని నందిగామకు చెందిన శ్రీనటరాజ నాట్య కళామండలి ఆధ్వర్యంలో కూచిపూడి నాట్య ప్రదర్శన, 11న మహిళా భక్తులకు వాయినం కార్యక్రమం ఉంటుందన్నారు. మూడు రోజుల పాటు హోమాలు, అన్నదానం చేపట్టనున్నట్లు తెలిపారు.



మునగాల: ముస్తాబైన శ్రీరామలింగేశ్వర హనుమాన్ ఆలయం

నేటి నుంచి అధ్యయనోత్సవాలు

హుజూర్‌నగర్ : పట్టణంలోని శ్రీవేణుగోపాల సీతారామచంద్రస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం నుంచి నాలుగు రోజుల పాటు అధ్యనోత్సవాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించనున్నట్లు ఈఓ గుజ్జుల కొండారెడ్డి శుక్రవారం తెలిపారు. 11వ తేదీ నుంచి వారం రోజుల పాటు వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆలయాన్ని రంగులు, మామిడి, పూల తోరణాలతో ముస్తాబు చేసినట్లు పేర్కొన్నారు.



హుజూర్‌నగర్ : శ్రీవేణుగోపాల సీతారామచంద్ర స్వామి ఆలయం

12న వేణుగోపాలస్వామి కల్యాణం

గరిడేపల్లి : మండలంలోని పొనుగోడు గ్రామంలో శ్రీరుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి వార్షిక కల్యాణ బ్రహ్మోత్సవాలను ఈ నెల 12వ తేదీన నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు, అర్చకుడు కాకులపాటి కృష్ణవంశీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేడుకకు భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

రేపు చౌటపల్లిలో వైద్య శిబిరం

మఠంపల్లి : మండలంలోని చౌటపల్లిలో గల ఎంపీపీఎస్ పాఠశాల ఆవరణలో ఈనెల 9న మైహోం సిమెంట్స్ పరిశ్రమ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు పరిశ్రమ ప్లాంట్ హెడ్ ఎస్.శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇంటర్ అడ్మిషన్ల కోసం ప్రచారం



బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులతో కలిసి కరపత్రం ప్రదర్శిస్తున్న అధ్యాపకులు

నడిగూడెం : వచ్చే విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం అడ్మిషన్ల కోసం శుక్రవారం నడిగూడెం సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థుల వివరాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డి.విజయనాయక్, అధ్యాపకులు డాక్టర్.జానీ పాషా, మహేష్, వీరన్న, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, రజిత, మదార్, సుజాత, ధనుంజయ్, హేమ, నాగరాణి, రవివర్మ పాల్గొన్నారు.

గడ్డివాము దగ్ధం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

హుజూర్‌నగర్ : గుర్తుతెలియని వ్యక్తి నిప్పు పెట్టడంతో సుమారు రూ.60 వేల విలువ గల గడ్డివాము దగ్ధమైన సంఘటన శుక్రవారం హుజూర్‌నగర్‌లో చోటు చేసుకుంది. స్థానికులు, బాధితుడు పర్వత వీరస్వామి తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ పట్టణంలో సుందరయ్య నగర్‌లో నిల్వ ఉంచిన సుమారు 600 మోపుల వరిగడ్డికి గుర్తుతెలియని వ్యక్తి నిప్పు పెట్టడంతో మంటలు లేచాయి. స్థానికులు గమనించి అగ్నిమాపక అధికారులకు తెలపడంతో వారి వెంటనే వచ్చి ఫైరింజన్, జేసీబీ సాయంతో మంటలను అదుపులోకి తెచ్చారు. దీంతో ప్రమాదం తప్పినట్లైంది. దగ్ధమైన గడ్డి విలువ దాదాపు రూ.60 వేలు ఉంటుందని, తనను ఆదుకోవాలని బాధితుడు కోరారు.

10న ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా



మాట్లాడుతున్న హుస్సేన్

హుజూర్‌నగర్‌రూరల్ : సామాన్యుడికి వ్యతిరేకంగా ఉన్న కేంద్ర బడ్జెట్‌పై నిరసనగా ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఈనెల 10న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించనున్న మహాధర్నాను జయప్రదం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి పోషణబోయిన హుస్సేన్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని అమరవీరుల స్మారక భవనంలో నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో మండల కమిటీ సభ్యురాలు తంగేళ్ల వెంకటచంద్ర, చందాల భిక్షం, వెంకటేశ్వర్లు, నర్సింహాచారి, వీరస్వామి, ఖాసీం, వెంకటయ్య, సైదా పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణకు కృషిచేయాలి

నేరేడుచర్ల : నులిపురుగుల నివారణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని నేరేడుచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని డాక్టర్ నాగిని కోరారు. శుక్రవారం నేరేడుచర్ల పీహెచ్‌సీలో ప్రభుత్వ, ప్రైవేటు ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లకు నిర్వహించిన శిక్షణలో ఆమె మాట్లాడారు. ఈనెల 10న నిర్వహించబోయే జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేసేందుకు సహకరించాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ శ్రీనివాస్, ధనమ్మ, సూపర్‌వైజర్ నర్సయ్య, వైద్యసిబ్బంది, అంగన్‌వాడీ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ నాగిని

తాగునీటి సమస్య రాకుండా చర్యలు

నడిగూడెం : రానున్న వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ దేవ భిక్షం తెలిపారు. శుక్రవారం నడిగూడెం మండలంలోని చెన్నకేశ్వాపురం, కరివిరాల, వెంకట్రాంపురం, కాగితరామచంద్రాపురం గ్రామాల్లో మిషన్ భగీరథ ట్యాంకులు, పైపులైన్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు తాగునీటి సరఫరాపై ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తామన్నారు. ఆయన వెంట గ్రిడ్ డీఈ అభినయ్, ఏఈ ఇర్ఫాన్, ఎంపీఓ విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు అన్వర్, అనిల్, విజయలక్ష్మి, తదితరులు ఉన్నారు.



వెంకట్రాంపురంలో తాగునీటి పైపులైన్‌ను పరిశీలిస్తున్న డీఈ దేవ భిక్షం

సీపీఎం నాయకుల రాస్తారోకో



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

గరిడేపల్లి : కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నందుకు నిరసనగా శుక్రవారం మండల కేంద్రంలోని మిర్యాలగూడ– కోదాడ ప్రధాన రహదారిపై సీపీఎం నాయకులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి షేక్ యాకూబ్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్.. రైతులు, కార్మికులు, నిరుద్యోగులకు వ్యతిరేకంగా ఉందని ఆయన ఆరోపించారు. కార్పొరేట్‌కు కొమ్ముకాస్తుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు తుమ్మల సైదయ్య, మాజీ సర్పంచ్‌లు దోసపాటి భిక్షం, యమగాని వెంకటేశ్వర్లు, అంబటి భిక్షం, మండవ సైదులు, రాయిరాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

యేసురత్నం సేవలు అభినందనీయం

సూర్యాపేటటౌన్ : క్రైస్తవ సమాజానికి వంగాల యేసురత్నం అందించిన సేవలు అభినందనీయమని వీవైఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు వంగాల రత్న ప్రసాద్ అన్నారు. యేసురత్నం 70వ జయంతి సందర్భంగా వీవైఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఖమ్మం క్రాస్ రోడ్డు అంబేద్కర్ విగ్రహం వద్ద, కొత్త బస్టాండ్, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో సుమారు 500 మందికి అన్నదానం చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వంగాల లాజరస్, సంద్రపాటి లాజరస్, నన్నెపంగ జయరాజ్, జిల్లెపల్లి కిరణ్, బొజ్జ ప్రశాంత్, వీవైఆర్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ పట్టణ శివారులోని ఎన్నెస్పీ కాలువ కట్ట దారిలో గల శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పూజారులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

అతివేగానికి యువకుడు బలి

- బైక్‌పై వెళ్తూ డివైడర్‌ను ఢీకొట్టి మృతి

కోదాడ రూరల్: అతివేగానికి ఓ విద్యార్థి బలయ్యాడు. ఈ ఘటన విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై కోదాడ పట్టణ పరిధిలోని కట్టకమ్ముగూడెం క్రాస్‌రోడ్‌లో గురువారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ పట్టణంలోని శ్రీనివాసనగర్‌కు చెందిన ఈశ్వర్(17) గురువారం రాత్రి తన స్నేహితుడు బర్త్‌డే వేడుకల్లో పాల్గొని బైక్‌పై ఇంటికి తిరిగి వస్తున్నాడు. బైక్‌పై అతివేగంగా వస్తూ కట్టకమ్ముగూడెం వద్ద హైవేపై డివైడర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఈశ్వర్ తీవ్రంగా గాయపడి మృతిచెందాడు. శుక్రవారం మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రంజిత్‌రెడ్డి తెలిపారు.

ఆటో బోల్తా.. పలువురికి గాయాలు

నేరేడుచర్ల: ఆగి ఉన్న బస్సును తప్పించబోయి ఆటో బోల్తా పడింది. ఈ ఘటన శుక్రవారం నేరేడుచర్ల సమీపంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నేరేడుచర్ల మండలం దిర్శించర్ల గ్రామానికి చెందిన ఎనిమిది మంది కూలీలు ఆటోలో గరిడేపల్లి మండలం పొనుగోడు గ్రామంలో ఇంటి స్లాబ్ వేసేందుకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో కోదాడ–జడ్చర్ల జాతీయ రహదారిపై నేరేడుచర్ల సమీపంలో శివాలయం వద్ద ఆగి ఉన్న బస్సును తప్పించబోయి ఆటో బోల్తా పడింది. దీంతో ఆటోలో ఉన్న కూలీలు వేముల రామయ్య, ఉప్పి మంగమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. మిగతా ఆరుగురికి స్వల్ప గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన ఇద్దరిని స్థానికులు 108 వాహనంలో చికిత్స నిమిత్తం మిర్యాలగూడ పట్టణంలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆటో బోల్తాపడడంతో రోడ్డుపై ట్రాఫిక్ జాం అయ్యింది. స్థానికులు ఆటోను పక్కకు జరిపించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.



గాయపడిన వారిని ఆస్పత్రికి తరలిస్తున్న స్థానికులు